

మనం
కడప | అన్నమయ్య

## రైల్వే కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



4లో



# దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు

### జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన

కడప, ఆగస్టు 4 (మనం న్యూస్) దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడడమే కాకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే.. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యం అని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన తోపాటు డిఆర్వో మల్లికార్జునుడు, గౌరవ అతిథిగా బద్వేలు ఎమ్మెల్యే డా. సుధా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సమావేశంలో అజెండాలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని విడివిడిగా పరిశీలిస్తూ అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ కింద నమోదయ్యే ప్రతి కేసులో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సహాయ, పునరావాస, ఉపాధి అవకాశాలు నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. చట్టం అమలులో అలసత్వానికి తావులేకుండా ప్రతి కేసును బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద నమోదైన పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, రాజంపేట పోలీసు ఉపవిభాగాలు, మహిళా పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల వివరాలను సమీక్షిస్తూ, దర్యాప్తు ఆలస్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నివేదికలు, న్యాయస్థానాల్లో ఉన్న స్టేలు, ఇతర పరిపాలనా కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు ఆర్థిక సహాయం విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేసిన సబ్ కలెక్టర్, 2026 జనవరి 1 నుంచి జూలై 20 వరకు ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద మంజూరైన ఆర్థిక సహాయం సంబందిత అంశాలపై సమీక్షించారు. ఈ పీరియడ్ న్ 34 కేసులకు చెందిన 46 మంది బాధితులకు రూ.74,31,250 ఆర్థిక సహాయం అందించిన వివరాలను పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి బాధితుడికి నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బద్వేలు ఎమ్మెల్యే డా. సుధా.. తమ నియోజకవర్గ పరిధిలోని ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసుల ఆలస్యంపై సమీక్షించారు. డెడ్ సందర్భంగా బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, పింఛన్లు, పునరావాస చర్యలు కూడా నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ సభ్యులను కోరారు. బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా అవసరమైన ప్రతి చర్యను వేగవంతం చేయాలన్నారు.

ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పురోగతి, కేసుల పరిష్కారం, శిక్షల శాతం తదితర అంశాలను కూడా కమిటీ సమగ్రంగా సమీక్షించింది. ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సమర్పించిన నివేదిక ఆధారంగా కేసుల స్థితిగతులను పరిశీలించిన సబ్ కలెక్టర్, నాణ్యమైన దర్యాప్తు, సమగ్ర ఆధారాల సేకరణ ద్వారా నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా పోలీసు, అభియోగ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంబంధిత శాఖలు నిర్దేశిత గడువులో అమలు చేయాలని, ప్రతి కేసుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చింతామణి, ఎస్డీసి నీలమయ్య, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్.డి.ఓ లు మురళి, శిరీష, చిన్నయ్య, చంద్రమోహన్, డివిజనల్ పోలీసు అధికారులు (ఎస్డీపీఓలు), ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శైలజ, తదితర కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనన, మరణాల నమోదు వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు

### రాజ్యసభ సభ్యులు మేడా రఘునాధరెడ్డి





రాజంపేట ఆగస్టు 4 మనం న్యూస్ : జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు--2026పై రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ మేడా రఘునాధ రెడ్డి మాట్లాడారు. దేశంలో జనన, మరణాల నమోదు వ్యవస్థను మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.గత రెండు దశాబ్దాల్లో దేశంలో జనన, మరణాల నమోదు శాతం గణనీయంగా పెరిగిందని, రెండేళ్లకు మించిన ఆలస్య నమోదులకు న్యాయపరమైన పరిశీలన తప్పనిసరి చేయడం ద్వారా తప్పుడు నమోదులను నివారించవచ్చని పేర్కొన్నారు. జనన, మరణాల సమగ్ర డేటాబేస్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా సాగుతుందని, అర్హులకే ప్రయోజనాలు అందేలా వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు.అయితే, రాష్ట్రాల మధ్య నమోదులో ఉన్న అసమానతలు, గ్రామీణ ప్రాంతాలు, పేదలు, దినసరి కూలీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వంటి బలహీన వర్గాలకు నమోదులో ఎదురయ్యే ఇబ్బందులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కఠినమైన ధృవీకరణ విధానంతో పాటు ప్రజలకు సులభమైన నమోదు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సూచనలతో జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ మేడా రఘునాధ రెడ్డి తెలిపారు.

## ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో నిర్లక్ష్యం సహించం

### అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. రవిబాబు





కడప, ఆగస్టు 4 మనం న్యూస్ జిల్లా హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, మొబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష (ఎంఏఎస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. రవిబాబు హెచ్చరించారు.

మంగళవారం దిశ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ కేంద్రాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరా వంటి సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలకు అవసరమైన హెచ్ఐవీ పరీక్షలు, చికిత్స, వైద్య సేవలను సకాలంలో అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. జిల్లాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తే ఎయిడ్స్ వ్యాప్తిని సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. సబ్‌సెంటర్లలో హెచ్ఐవీ స్క్రీనింగ్‌ను 95 శాతం లక్ష్యానికి చేరవేయడంతో పాటు, హెచ్ఐవీ బాధితుల్లో 95 శాతం మందికి చికిత్స అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే వైరల్ లోడ్ నియంత్రణలో 99 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో దిశా సూపర్వైజర్ ప్రసాద్, సీపీఓ ఆనంద్, ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రోగ్రామ్ మేనేజర్లు, ఎంఈఏలు, డీఎస్ఆర్సీ, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.





# రాళ్లచెరువు పల్లిలో హోరెత్తిన టిడిపి డోర్ టు డోర్ ప్రచారం


**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: టిడిపి యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి**

**ఇంటింటికీ సంక్షేమ పథకాల అవగాహన,మద్దతు తెలిపిన ప్రజలు**

ఓబులవారిపల్లి , ఆగస్టు 04, మనం న్యూస్ తిరుపతి జిల్లా,రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లి మండలం రాళ్ల చెరువు పల్లి పంచాయతీ పరిధిలోని అరుంధతివాడ, హరిజనవాడల్లో టిడిపి యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి మంగళవారం విస్తృతంగా 'డోర్ టు డోర్' కార్యక్రమం నిర్వహించారు. రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి కుమారుడైన సాయి వికాస్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి



కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, రహదారుల దుస్థితి, విద్యుత్, పారిశుద్ధ్య లోపాలు, పింఛన్లు మరియు రేషన్ కార్డుల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు.ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడానికే ఈ డోర్ టు డోర్ కార్యక్రమం చేపడుతున్నాం అని, స్థానికులు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తాం అని, గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతాం అని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించే వరకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ముక్కా సాయి వికాస్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.





# రైల్వే కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

## బాలింతలకు అవగాహన కల్పించిన వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మకుమారి

రైల్వేకోడూరు, ఆగస్టు 04, మనం న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బాలింతలు, గర్భిణులకు మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మకుమారి మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లిపాలే మొదటి టీకా అని, బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రసవించిన మొదటి గంటలోనే బిడ్డకు ముర్రుపాలు పటడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు.

కనీసం ఆరు నెలల వయసు వరకు శిశువులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీళ్లు కూడా పట్టాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై, సరైన పోషకాహారం తీసుకోవడంపై పలు సూచనలు, సలహాలు అందించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ ఉష మరియు ఆసుపత్రి సిబ్బంది, నర్సులు, ఆశా కార్యకర్తలు మరియు బాలింతలు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం


## డోర్,టుడోర్‌లో పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షుడు కాపెర్ల.చంద్రశేఖర్ నాయుడు



పుల్లంపేట ఆగస్టు 4 (మనంన్యూస్)ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి గారి ఆదేశాల మేరకు పుల్లంపేట మండలంలోని టి.కమ్మపల్లి గ్రామ పంచాయతీలో టి.డి.పి అధ్యక్షుడు కాపెర్ల.చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం ఇచ్చిన పథకాల గురించి తెలియజేసి మంచి ప్రభుత్వానికి అండదండగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కావుటూరు వెంకటాద్రి నాయుడు, నాగినేని వెంకటయ్యనాయుడు, ముమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, నాగినేని రెడ్డెమ్మ, నేలపాటిరత్నమ్మ, కంచర్లకృష్ణకుమారి, కర్ణంనరసమ్మ, భీమిశెట్టి గంగాధర్,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో గుర్తింపు సాధ్యం

## - టీచర్ బైరెడ్డి రాఘవ రెడ్డి -



పెనగలూరు(ఆగస్టు 04),మనంన్యూస్:విద్యతోనే సమాజంలో గుర్తింపు సాధ్యమని ఎస్టీయు ఏపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు, పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆంగ్ల భాషోపాధ్యాయులు బైరెడ్డి రాఘవ రెడ్డి తెలిపారు. మంగళవారం పెనగలూరు మండల కేంద్రంలోని ఇండ్లూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు తన తండ్రి బైరెడ్డి వెంకట కృష్ణారెడ్డి జ్ఞాపకార్థముగా విద్యా సామగ్రి అందించారు. విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, ఎరేజర్లు, బలపాలు మొదలైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత రాఘవ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇండ్లూరు ప్రాథమిక పాఠశాలకు తన తండ్రి జ్ఞాపకార్థం విద్యా సామాగ్రి మరియు ఆగస్టు 15 న విద్యార్థులకు మిఠాయిలు అందిస్తానని హామీ ఇచ్చారు. పలువురు ఎస్టీయు నాయకులు దాత రాఘవ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర నాయకులు అల్లం అశోక్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు జీ.శ్రీనివాసులు, కోటపాటి యానాదయ్య, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు సురేంద్ర, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, రాము, ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, నాయకులు ప్రసాద్, బీ. శ్రీనివాసులు, టీచర్ రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరం పై పోలీస్‌ల దాడులు

నందలూరు మనం న్యూస్ ఆగస్టు 4: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లె గ్రామం నుండి మంటపంపల్లి గ్రామం వైపు వెళ్ళు దారిలో గల చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం పక్కన గల చీకి చెట్ల వద్ద మంగతాయి జూదం ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి జూదం ఆడుతున్న 8 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 27,300/- రూపాయల నగదు, 52 పేక ముక్కలు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# కన్న కూతుర్ని, కన్నతల్లిని హతమార్చింది కన్న కొడుకే?

**పంట పొలంలో తల్లిని హతమార్చింది కన్న కొడుకే? సీసీ కెమెరాలు తనిఖీలు చేపట్టిన పోలీసులు**



సిద్ధవటం ఆగస్టు 4(మనం న్యూస్)

నవమాసాలు మోసి, పెంచి పెద్ద చేసిన తన కన్నతల్లినే అతి కిరాతకంగా కన్న కొడుకే హత్య చేసి పరారయ్యాడు సిద్ధవటం మండలంలోని మూలపల్లి, మాచుపల్లి రహదారి మాచుపల్లి రెవిన్యూ పొలం మృత్యుంజయ రెడ్డి వరి పంట పొలంలో ఓబులమ్మ (50) అనే మహిళ మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు, మృతి చెందిన మహిళ వద్ద ఉన్న పర్సు లో మైదుకూరు గ్రామంలోని, బంగారం దుకాణం అడ్రస్ తో కూడిన సమాచారం లభ్యం కావడంతోమృతి చెందిన ఓబులమ్మ వనిపెంట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన సిద్ధవటంలో రఘునాథ్ మాట్లాడుతూ మృతి చెందిన ఓబులమ్మ కు వెంకటరమణ, బాబు, రఘునాథ్ ముగ్గురు కొడుకులు ఉన్నామని మా అన్న బాబు కడప నగరంలో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగించే వాడని సోమవారం రాత్రి 7 గంటలకు ద్విచక్ర వాహనంలో వనిపెంట నుండి మా తల్లి ఓబులమ్మను తీసుకొని వచ్చాడని తన కన్న కూతురు హారిక (21) పై అనుమానం పడేవాడని తన తల్లి ఓబులమ్మను తన కూతురు వద్దే ఉండమని చెప్పేవాడని పెన్షన్ కోసం వనిపెంటకు వచ్చిందని కూతురిపై అనుమానంతో హతమార్చాడని తల్లిని ద్విచక్ర వాహనంలో తీసుకొని వచ్చి హత్య చేసినట్లు అనుమానం కలిగిస్తుందని తెలిపారు మా శ్రీమతి అయ్య వారమ్మ ను కూడా హత్యాయత్నం చేయాలని చూశాడని తెలిపారు ముద్దాయి ఆచూకీ కోసం పలు సిసి కెమెరాలు అనుమానిత ప్రదేశాలలో పోలీసులు విస్తృతంగా గాలింపులు చేపట్టారు జరిగిన సంఘటనపై డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు హారిక, శ్రీనివాసులు విచారణ చేపట్టారు

# రైతుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం: ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వే కోడూరు, ఆగస్టు 04, మనం న్యూస్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తోందని రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ తెలిపారు. రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమగ్రంగా చర్చించారు.

2003లో నిలిచిపోయిన సియంఎఫ్ మార్కెట్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి, ఈ మార్కెట్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించేలా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**బొప్పాయి రైతులకు అండగా రూ. 18 గిట్టుబాటు ధర**

ఇటీవల బొప్పాయి రైతులు ఎదుర్కొన్న గిట్టుబాటు ధర సమస్యపై తక్షణమే స్పందించామని ఎమ్మెల్యే వివరించారు. అధికారులతో, మార్కెటింగ్ విభాగంతో పలుమార్లు సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, ప్రత్యేక చొరవతో బొప్పాయి కిలోకు రూ. 18 గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతుల పక్షాన ఎల్లప్పుడూ అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. ?ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొని రైతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి తో పాటు మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక రైతు నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు సొంత నిధులను పెన్షన్ల పంపిణీ చేసిన రామిరెడ్డి ధ్వజారెడ్డి



రైల్వేకోడూరు, ఆగస్టు 04, మనం న్యూస్ : రైల్వే కోడూరు మండల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మండల ఉపాధ్యక్షులు, వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో సమాజ సేవ నిరంతరం కొనసాగుతోంది. మండలంలో ఉన్న దాదాపు 45 మంది అభాగ్యులకు ఆయన స్వయంగా తన సొంత నిధుల నుండి ?1,23,000 నగదును పెన్షన్ల రూపంలో అందజేశారు. ధ్వజారెడ్డి మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా సొంత నిధులతో బాధితులకు, పేదలకు సహాయం అందించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఆయన తెలిపారు. సమాజ సేవ చేయడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నానని, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆశీస్సులతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవలో ముందంజలోనే ఉంటానని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పాలెంకొంట రత్తమ్మ, సర్పంచులు ఆర్.వి. రమణ, నాయని హరికృష్ణ రెడ్డి, ఆనాల చెంగల్ రెడ్డి, గోపి, సుబ్రమణ్యం ఎంపీటీసీలు నూకా మహేశ్వర్ రెడ్డి, షేక్ షఫీ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, ఆనంద్ యాదవ్, మల్లు కృష్ణారెడ్డి, బత్తల సుబ్రమణ్యం, బత్తల మణి, కంభం శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి అనిల్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు పాటూరు శ్రీనివాసులు రెడ్డి



చిట్వేలీ ఆగస్టు 4 మనం న్యూస్ ప్రతినిధి: చిట్వేలి మండల రాజకీయాలలో ప్రత్యేక ముద్ర వేయించుకున్న కుటుంబం టిడిపి నాయకులు, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులు రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి, నారా లోకేష్ ను మంగళవారం వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాటూరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు ఆశా కిరణం పార్టీని ఒంటి చేత్తో నడిపించగల సామర్థ్యం, కార్యకర్తకు నేనున్నానని భరోసా ఇవ్వగల నాయకత్వం యువ నాయకులు నారా లోకేష్ లో పుష్కలంగా ఉన్నాయని ఆయన తెలియజేశారు. అలాగే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పలు విషయాలపై చర్చించుకున్నట్లు ఆయన తెలియజేశారు. పెద్దల ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా తను పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తనకంటూ ప్రత్యేక ఎజెండా ఏదీ లేదని ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేయడం జరుగుతుందని ఆయన పాటూరు తెలియజేశారు.


## హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఇంచార్జ్‌గా చిన్నిరెడ్డి గోవర్ధన్ రెడ్డి నియామకం



రైల్వేకోడూరు, ఆగస్టు 04, మనం న్యూస్:దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా, తిరుపతి జిల్లాకు సంబంధించిన బాధ్యతలను నిర్వహించేందుకు ఇంచార్జుల నియామకం జరిగింది. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ యువమోర్చా నాయకులు చిన్నిరెడ్డి గోవర్ధన్ రెడ్డికి ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తనకు ఈ కీలకమైన బాధ్యతను అప్పగించినందుకు గాను భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధిష్టానానికి, పార్టీ పెద్దలకు గోవర్ధన్ రెడ్డి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పే హర్ ఘర్ తిరంగా లాంటి గొప్ప కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇంచార్జ్‌గా నన్ను నియమించడం చాలా సంతోషంగా ఉంది. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను ఇచ్చిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# కలెక్టర్ గారు మాకు న్యాయం చేయండి

## నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అభ్యర్థన



చిట్వేలి ఆగస్టు 4 మనం న్యూస్ ప్రతినిధి: చిట్వేలీ మండల పరిధిలోని తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తమ భూములను అక్రమంగా కబ్జా చేశారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తన తండ్రి నాగిరెడ్డి వెంకటరెడ్డి పేరున ఉన్న మూడు వృత్తుల భూమిని మూడున్నర భాగాలు, ఒక చెరువు కట్ట వద్ద ఉన్న భూమిని కొందరు వ్యక్తులు నకిలీ రికార్డులతో ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ భూ వివాదంపై గతంలో రైల్వేకోడూరుకోర్టు, నెల్లూరు కోర్టు, కడప కోర్టుల్లో కేసులు నడవగా, తమకే అనుకూలంగా తీర్పులు వచ్చాయని ఆయన పత్రాలను చూపిస్తూ తెలిపారు. అయినప్పటికీ, స్థానిక వీఆర్ఓగా పనిచేసిన వ్యక్తి, ఆయన కుమారుడు ప్రజలను మభ్యపెట్టి, నకిలీ పత్రాలు సృష్టించి తమ భూములను సుమారు 50 మందికి అక్రమంగా కబ్జా చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు.కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ, భూములు ఆక్రమణకు గురికావడంతో ప్రభుత్వ పథకాలు, పాస్‌బుక్‌లు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయన తెలిపారు. వెంటనే స్పందించి, విచారణ జరిపి తమకు, గ్రామస్తులకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసిల్దార్లను ఆయన వేడుకున్నారు

# సీఎం చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నేత పాటూరు శ్రీనివాసులు రెడ్డి

చిట్వేలి ఆగస్టు 4 మనం న్యూస్ ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని తిరుపతి జిల్లా నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తో కలిసి రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి నాయకులు, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వక కలిసినట్లు పాటూరు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అమరావతి టిడిపి కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు ని కలిసి రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పలు విషయాలపై చర్చించినట్లు పాటూరు శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు పలు విషయాలపై సానుకూలంగా స్పందించినట్లు పాటూరు పేర్కొన్నారు.

